

భారీగా సమ్మక్క బ్యారేజ్ నీటి విడుదల

- వర్షాకాల సీజన్ ప్రారంభం కావడంతో దిగువకు..
- అవసరాలను బట్టి నీటిని నిల్వ చేస్తాం..: ఏఈ సాయిరాం



బ్యారేజి నుంచి దిగువకు వదులుతున్న నీళ్లు

కన్నాయిగూడెం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజి నుంచి భారీగా నీటిని దిగువకు వదులుతున్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో నీటి లభ్యత పెరగటంతో విడుదల చేస్తున్నారు. ఈ ఎండా కాలంలో ఏప్రిల్ చివరి నుంచి మే మొదటి వారం వరకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో పూర్తిగా తగ్గిపోవడంతో బ్యారేజి డెడ్ స్టోరేజికి చేరుకుని దేవాదుల ఇన్‌టేక్‌వెల్ నుంచి నీటిని పంపింగ్ చేయలేదు. ఈ సంవత్సరం వర్షాలు మే నెల మధ్య నుంచి ప్రారంభం కావడంతో ఎన్నడూలేని విధంగా బ్యారేజిలో నీటి నిల్వలు పెరిగాయి. దీంతో ఇంజనీరింగ్ అధికారులు బ్యారేజిలో నీటిని నిల్వ చేసుకుంటూ వస్తున్నారు. జూన్ 2 వరకు వచ్చిన నీటిని వచ్చినట్లు నిల్వ చేసి 3.264 టీఎంసీల నిల్వలను మెయింటెన్ చేసిన అధికారులు ప్రస్తుతం వర్షాలు ప్రారంభం కావడంతో ఎగువ నుంచి భారీగా వరద వస్తుండటంతో జూన్ 3 నుంచి క్రమక్రమంగా బ్యారేజిని ఖాళీ చేస్తున్నారు. ఎగువ నుంచి 7వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో బ్యారేజిలోని రెండు గేట్ల ద్వారా 7,500 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. బ్యారేజి పూర్తి స్థాయి సామర్థ్యం 6.94 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1.905 టీఎంసీల నీళ్లు నిల్వ ఉన్నాయని బ్యారేజి ఏఈ సాయిరాం తెలిపారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో బ్యారేజిలో నీటి లభ్యత ఎక్కువ ఉండటంతో ప్రస్తుతం నీటి అవసరాలు తక్కువ ఉండటంతో దిగువకు నీటిని భారీగా వదులుతున్నామన్నారు. అవసరాలకు అనుగుణంగా మళ్లీ నిల్వ చేస్తామని ఏఈ పేర్కొన్నారు.

కేటీపీపీని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు



కేటీపీపీలో ట్రైనీ ఐఏఎస్‌లు

గణపురం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : గణపురం మండలం చెల్పూరులోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టును ట్రైనీ ఐఏఎస్‌లు బుధవారం సందర్శించారు. 2024 బ్యాచ్‌కు చెందిన సివిల్ సర్వీసెస్ శిక్షణా బృందం సౌరబ్ శర్మ, సలోని చబ్రా, హర్ష చౌదరి, కెరోలిన్ చింగ్తియనమావి, ప్రణయ్‌కుమార్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా థర్మల్ ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తి నిర్వహణ, బొగ్గు నిల్వల సేకరణ, అధికారుల పనితీరు, ప్రాజెక్టు ఆదాయ, వ్యయాలు, నీటి లభ్యత తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఓపెన్‌కాస్టు-2ను సందర్శించి బ్లాస్టింగ్ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. 5ఇంక్లైన్ అండర్ గ్రౌండ్‌లోనికి దిగి బొగ్గు తీసే విధానంను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కేటీపీపీ అధికారులు, సింగరేణి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బడి గంటలు మోగే వేళ..



- నేటి నుంచి స్కూళ్ల పునఃప్రారంభం
- ముస్తాబైన ప్రభుత్వ పాఠశాలలు
- ఇంకా పూర్తికాని అభివృద్ధి పనులు
- భూపాలపల్లి జిల్లాలో 432 పాఠశాలలు
- తొలిరోజే పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నోటు పుస్తకాల పంపిణీ

భూపాలపల్లిటౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగించుకొని గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఇప్పటికే ప్రధానోపాధ్యాయులు ఆయా పాఠశాలలను ముస్తాబు చేయించారు. ప్రభుత్వ పాఠశాలలు రంగులతో మెరిచిపోతున్నాయి. అయినప్పటికీ ఇంకా కొన్ని పాఠశాలల్లో 'మన ఊరు - మన బడి' పనులు పూర్తికాక పోగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల్లో సైతం పనులు కొన్ని మిగిలిపోయాయి. వెరసి ఇంకా కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు సమస్యలు ఎదుర్కోక తప్పదు. పాఠశాలల పునఃప్రారంభం రోజే ఉపాధ్యాయులు విద్యార్థులకు దుస్తులు, నోటుబుక్కులతో పాటు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయనున్నారు.

ముస్తాబైన పాఠశాలలు

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు రంగులతో ముస్తాబయ్యాయి. గురువారం నుంచి బడి గంట మోగనుండడంతో విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో తరగతి గదులు, వంటశాలలు, తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణ పనులు కొన్నింటిలో పూర్తిగా కాగా, వాటిని రంగులతో చక్కదిద్దారు. ప్రైవేటు పాఠశాలలను తలపించేలా ప్రభుత్వ బడులను తయారుచేశారు.

బడిబాటలో చేరిన 389 మంది

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జడ్పీహెచ్ఎస్‌లు 69, ప్రాథమిక పాఠశాలలు 319, ప్రాథమికోన్నత పాఠశాలలు 44 ఉన్నాయి. మొత్తంగా వీటిలో 1,570 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఇంకా 233 మంది ఉపాధ్యాయులు భర్తీ కావాల్సి ఉంది. అయితే ఆయా పాఠశాలల పరిధిలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో జిల్లా మొత్తంగా ఇప్పటివరకు 389 మంది బడిలో చేరేందుకు అడ్మిషన్లు చేయించినట్లు అధికారులు తెలిపారు.



ముస్తాబైన భూపాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల

అసంపూర్తిగానే అభివృద్ధి పనులు

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు గాను గత ప్రభుత్వం 'మన ఊరు - మన బడి' కింద జిల్లాకు రూ.22కోట్లు మంజూరు కాగా, 149 పాఠశాలల్లో పనులు ప్రారంభించారు. కానీ, 51 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. వాటికి సంబంధించిన నిధులు రూ.3కోట్లు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇంకా మిగతా పాఠశాలల్లో 70 నుంచి 80 శాతం పనులు పూర్తయినట్లు తెలిపారు. అలాగే ప్రస్తుత ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కింద 265 పాఠశాలలను దత్తత తీసుకుంది. వీటిలో తాగునీరు, మరుగుదొడ్ల మరమ్మతు, మైనర్ రిపేర్లు, విద్యుత్ పనులు చేయాల్సి ఉంది. దీనికి గాను 940 పనులు ఇచ్చారు. ఇందులో 205 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. ఇంకా 60 పాఠశాలల్లో పనులు జరుగుతున్నాయి. కానీ, వాటికి సంబంధించిన బిల్లులు అధికారులకు సమర్పించలేదని చెబుతున్నారు. ఈ పనులకు గాను రూ.12.40 కోట్లు మంజూరు కాగా ఇంకా పూర్తికాలేదు.



శిలాఫలకానికే పరిమితమైన టేకుమట్ల పాఠశాల భవన నిర్మాణం

నేడు పాఠ్యపుస్తకాలు, దుస్తుల పంపిణీ

పాఠశాలల్లో గురువారం నుంచి తరగతులు ప్రారంభం కానుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రారం భం రోజే విద్యార్థులందరికీ దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నో టుబుక్కులు పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు డీఈవో రాజేందర్ తెలిపారు. ఏమైనా తక్కువపడితే వెంటనే తెప్పించేలా ఏర్పాట్లు చేస్తున్నామ ని స్పష్టం చేశారు. అలాగే మధ్యాహ్నభోజనం సౌకర్యం కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఈసారి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో భాగంగా కుస్తీ పడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంలో భాగంగా బడిబాట కార్యక్రమాన్ని ఇప్పటికే పూర్తిచేసినట్లు పేర్కొన్నారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- తల తాకట్టు పెట్టైనా సంక్షేమ ఫలాల అమలు
- అర్హులందరికీ దశల వారీగా ఇళ్లు
- ములుగు జిల్లాకు మరో వెయ్యి ఇళ్లు మంజూరు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ములుగు జిల్లాను పర్యాటక ఖిల్లాగా మారుస్తాం: మంత్రి సీతక్క

ములుగు రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించి ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. తల తాకట్టు పెట్టైనా సంక్షేమ ఫలాలను అమలు చేయడం జరుగుతుందని, అర్హులందరికీ దశల వారీగా ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. ములుగు మండలం ఇంచర్ల గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో బుధవారం ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ, నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి 23మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి మాట్లాడారు.



సభకు హాజరైన ప్రజలు





ఇంచర్ల సభలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రి సీతక్క, ఎంపీ బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, కలెక్టర్ టీఎస్ దివాకర,

ప్రజా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రూ.22,500 కోట్లతో 4.5లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందని అన్నారు. గతంలో సైతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పూర్తిచేసిందని తెలిపారు. గత పదేళ్లుగా డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని పేదలకు సాకులు చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం 93వేల ఇళ్లకు టెండర్లు పిలిచి 60వేల ఇళ్లను మాత్రమే పూర్తి చేసిందని అన్నారు. రాష్ట్రంలోని ఇందిరమ్మ ప్రభుత్వం సంవత్సర కాలంలోనే 4.5 లక్షల ఇళ్లను నిర్మించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతుందని, ఇందులో ములుగు నియోజకవర్గానికి 3వేల ఇళ్లు మంజూరు కాగా, ఐటీడీఏకు మరో 1,500 ఇళ్లు మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. తాను మరో 1000 ఇళ్లను మంజూరు చేస్తున్నానని హామీ ఇచ్చారు.

మంత్రి సీతక్క మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ డబుల్‌బెడ్‌రూం ఇళ్లు అందిస్తామని ప్రజలను మోసం

»» మిగతా 8వ పేజీలో...

నేడు రామప్పకు పీసీ ఘోష్



హనుమకొండ టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి, కాళేశ్వరం ప్రాజెక్టు ఎంక్వైరీ కమిషన్ చైర్మన్ పీసీ ఘోష్ గురువారం రామప్ప పర్యటనకు వెళ్లనున్నట్లు సంబంధిత అధికారులు బుధవారం తెలిపారు. ఢిల్లీ నుంచి హైదరాబాద్ తాజ్ కృష్ణ హోటల్ నుంచి బయల్దేరి హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌కు బుధవారం సాయంత్రం చేరుకున్నారు. గురువారం ఉదయం 9.30 గంటలకు హరిత కాకతీయ హోటల్ నుంచి రోడ్డు మార్గం ద్వారా రామప్పకు ఉదయం 10.40 గంటలకు చేరుకొని దర్శనం చేసుకొని మధ్యాహ్నం 1.30 గంటలకు హరిత కాకతీయ హోటల్‌కు చేరుకుంటారని, హైదరాబాద్‌కు సాయంత్రం 3 గంటలకు బయల్దేరి రాత్రి 7గంటలకు హోటల్ తాజ్‌కృష్ణ చేరుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- పలు గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన



టేకుమట్లలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

టేకుమట్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. టేకుమట్ల మండల వ్యాప్తంగా బుధవారం 21 గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆయన టెంకాయ కొట్టి శంకుస్థాపన చేశారు. అనంతరం సుబ్బక్కపల్లి, పంగిడిపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి, అంకుషాపూర్, వెంకట్రావుపల్లి, బండపల్లి, ఆరెపల్లిలో సీసీరోడ్ల నిర్మాణానికి, కలికోటపల్లి, ఆరెపల్లి గ్రామాలలో నూతన గ్రామ పంచాయితీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వెలిశాల, గర్మిళ్లపల్లిలో నూతనంగా నిర్మించిన పల్లె దవాఖానలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్నామన్నారు. ఇప్పుడు వచ్చిన జాబితాతోనే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పూర్తవ్వలేదని, దశల వారీగా ఇళ్ల మంజూరు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఇల్లు రాలేదని ఎవరూ దిగులు చెందవద్దన్నారు. గత ప్రభుత్వంలో మంజూరై మధ్యంతరంగా ఆగిపోయిన ఇళ్ల నిర్మాణం కోసం సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులు కేటాయిస్తామన్నారు. ప్రజల సౌకర్యార్థం పలు గ్రామాలలో సీసీ రోడ్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. అనంతరం గర్మిళ్లపల్లిలో జరిగిన బొడ్రాయి వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇందిరమ్మ ఇంటి పరిశీలన

టేకుమట్ల గ్రామంలో ఓ లబ్ధిదారుడు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరిశీలించి లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బిల్లుల మంజూరులో ఆలస్యం జరిగిందా, ఎవరైనా లంచాలు అడిగారా.. అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఇల్లు మంజూరైన లబ్ధిదారులు ఇదే తరహాలో ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. బిల్లుల మంజూరులో ఏదైనా సమస్య ఉంటే సంబంధిత అధికారులను లేదా నేరుగా తనను కలిస్తే పరిష్కారం చూపిస్తామన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్, మాజీ జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

సీఎం ఇన్‌స్టా హ్యాండిల్‌లో 'ఫీజులు మాకొద్దు.. బడికొస్తే చాలు' కథనం

మహదేవపూర్ రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన 'ఫీజులు మాకొద్దు.. బడికొస్తే చాలు' అనే కథనానికి అరుదైన స్పందనలభించింది. ఏకంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన అఫీషి యల్ ఇన్‌స్టా హ్యాండిల్‌లో ఈ కథనాన్ని అటాచ్ చేశారు. సీఎం ఇన్‌స్టా స్టోరీలో ఆంధ్రజ్యోతి కథనం పెట్టడంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఉపాధ్యాయుడు ఎందరికో ఆదర్శం అంటూ పలువురు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నారు.

పోలీసు అధికారులు ఆదర్శంగా నిలవాలి

- ఉత్తమ సేవలందిస్తూ ప్రజలకు రక్షణ కల్పించాలి
- ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ



డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

ఏటూరునాగారం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పోలీసు అధికారులు ఉత్తమ సేవలు అందిస్తూ ప్రజలకు రక్షణ కల్పించడంతో పాటు విధి నిర్వహణలో ఆదర్శంగా నిలవాలని ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ఏఎస్పీ కార్యాలయంలో ఏటూరునాగారం డివిజన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పలువురు పోలీసు అధికారులకు ఏఎస్పీ రివార్డులు అందజేసి మాట్లాడారు. విధుల్లో అత్యుత్తమ సేవలు అందించిన పోలీసు అధికారులకు గుర్తింపుగా రివార్డులను ప్రదానం చేసినట్లు తెలిపారు. పోలీసు శాఖ అధికారుల కృషిని ప్రోత్సహించేందుకే ఇలాంటి రివార్డులు అందిస్తున్నామని స్పష్టం చేశారు. సమాజంలో పోలీసులు అంటే ప్రజలు గౌరవించే విధంగా అంకితభావంతో విధులు నిర్వహించాలని ఏఎస్పీ సూచించారు. ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రజల్లోనూ, అధికారుల వద్ద ప్రత్యేక గుర్తింపు ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. ములుగు జిల్లా పోలీసు శాఖ ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తున్న అధికారులను గుర్తించి వారిని ప్రోత్సహించే దిశగా కీలక అడుగులు వేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్, వెంకటాపురం సీఐ బండారి కుమార్, ఏటూరునాగారం, మంగపేట, వాజేడు, కన్నాయిగూడెం ఎస్సైలు తాజుద్దీన్, టీవీఆర్.సూరి, వెంకటేష్, రాజ్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సీఐ శ్రీనివాస్‌కు రివార్డును అంజేస్తున్న ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

తోపుకుంట చెరువులో భారీగా చేపలు మృతి

- సుమారు ఐదు టన్నుల చేపలు మృత్యువాత



ములుగు శివారులోని తోపుకుంటలో మృతి చెందిన చేపలు

ములుగు టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ములుగు మండల పరిధిలోని తోపుకుంటచెరువులో బుధవారం భారీ సంఖ్యలో చేపలు మృత్యువాత పడ్డా యి. సుమారు 5 టన్నుల బరువున్న, దాదాపు రూ.5 లక్షల విలువైన పెద్దపెద్ద చేపలు చనిపోవడంతో మత్స్యకారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేపలమృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. కాగా, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ సాదు రఘు తోపుకుంట చెరువును సందర్శించి చనిపోయిన చేపలను పరిశీలించారు. అనంతరం, రెండు చేప ల నమూనాలను, రెండు లీటర్ల నీటి నమూనాలను సేకరించి హైదరాబాద్‌లోని ప్రయోగశాలకు పరిశీలన నిమిత్తం పంపించారు. నివేదిక వచ్చిన తర్వాతే చేపల మృతికి గల కారణాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది. మృతి చెందిన చేపల విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని భావిస్తున్నారు. మత్స్యకారులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని వారు కోరారు.

ఇంటర్ లింకింగ్ లైన్ల పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

రాంనగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పురోగతిలో ఉన్న ఇంటర్ లింకింగ్ లైన్ల పనులను యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం హనుమకొండ కార్పొరేట్ కార్యాలయంలో సీఈలు నోడల్ జీఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్లలో వంద శాతం రెవెన్యూ కలెక్షన్లు తీసుకురావాలని, కేబుల్ ఆపరేటర్లు విద్యుత్ పోల్స్‌పైన చిందర వందరంగా వైర్లు పెట్టకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోల్‌రెంటల్ గ్రామాల్లో రూ.15, అర్బన్‌లో రూ.20 వసూలు చేయాలని సూచించారు. కాలిపోయిన, పని చేయని విద్యుత్ మీటర్లను తొలగించి కొత్త మీటర్లను అమర్చాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్లను తగ్గించి డిపార్ట్‌మెంట్ షెడ్లల్లోనే ట్రాన్స్‌ఫార్మర్లను రిపేర్ చేయాలన్నారు. లైన్ క్లియరెన్స్ ఎల్‌సీ యాప్ ద్వారానే చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డైరెక్టర్ బి.అశోక్ కుమార్, పి.సదర్‌లాల్, వి.తిరుపతిరెడ్డి, సీఈలు కె.తిరుమల్‌రావు, రాజ్‌చౌహాన్, అశోక్, వెంకటరమణ, జీఎంలు వేణుబాబు, కృష్ణమోహన్, వెంకటకృష్ణ, శ్రీనివాస్, సత్యనారాయణ, సురేందర్, ఉత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

డైట్, బీఈడీ కళాశాలల్లో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ప్రభుత్వ డైట్, బీఈడీ కళాశాలల్లో వివిధ విభాగాల్లో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీ కోసం అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా డైట్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్‌హై బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 65 సంవత్సరాలోపు వయస్సు కలిగి, నిరుద్యోగ, రిటైర్డ్ అధ్యాపకులు దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులని ఆయన తెలిపారు. ఎంపికైన కరిక్యులర్ అభ్యర్థులకు నెలకు రూ.23,400, కోకరిక్యులర్ అభ్యర్థులకు నెలకు రూ.15,600 గౌరవ వేతనం అందజేస్తారని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు సంబంధిత దరఖాస్తు ఫారాలను 13 నుంచి 19 వరకు ఆయా కళాశాలల్లో సమర్పించాలని సూచించారు. 21న తుది జాబితాను ప్రకటించి 24 నుంచి 26 వరకు మెరిట్ ప్రాతిపదికన 1:5 నిష్పత్తిలో డెమో, ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను 28న ప్రకటిస్తామని, వారు జూలై 1నుంచి కళాశాలకు హాజరు కావాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. పోస్టులు, వాటికి సంబంధిత ఖాళీలకు ఆయా కళాశాలల్లో సంప్రదించాలని ఆయన కోరారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


మృతి చెందిన కోట భిక్షం

పెద్దవంగర, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని అవుతాపురం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అవుతాపురం గ్రామానికి చెందిన కోట భిక్షం(68)-ముత్తమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు కోట శ్రీను-శోభ దంపతులకు కుమార్తె శిరీష జన్మించిన తర్వాత కొద్ది రోజులకు శ్రీను మృతి చెందాడు. శోభ మరో వ్యక్తిని వివాహం చేసుకోగా శిరీష వారి అమ్మమ్మ ఇంటి వద్ద పెరిగింది. చిన్న కుమారుడు కోట అశోక్-రమ దంపతులతో కలిసి కోట భిక్షం-ముత్తమ్మ దంపతులు ఉంటున్నారు. కోట భిక్షం పేర సుమారు 5ఎకరాలు ఉండగా, పెద్ద కుమారుడైన శ్రీను కుమార్తె శిరీష పేరు మీద ముప్పై గుంటల భూమిని ఇటీవల పెద్దమనుషుల సమక్షంలో రిజిస్ట్రేషన్ చేయించారు. ఆ భూమిని శిరీష సాగుచేసుకునే క్రమంలో తరచూ గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి చిన్న కోడలు కోట రమ అత్తమామలతో గొడవలు పడి వారిని కొట్టింది. బుధవారం రోజున కోట భిక్షం అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. తండ్రి మరణ విషయం తెలుసుకున్న వల్లపు రేణుక తమ్ముడు కోట అశోక్-రమ దంపతులను నిలదీయడంతో కాసేపు వాగ్వాదం జరిగింది. తన తండ్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని వల్లపు రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు షురూ

- అడ్డుకున్న రైతులు.. అధికారులతో వాగ్వాదం
- బహిరంగ మార్కెట్ ధర చెల్లించాలని డిమాండ్
- అధికారులు సర్దిచెప్పడంతో సద్దుమణిగిన వివాదం


హైవే నిర్మాణ పనులను అడ్డుకున్న భూ బాధిత రైతులు

దామెర, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా దామెర మండలం పసరుగొండ క్రాస్ రోడ్‌లో చేపట్టిన గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు నిర్మాణ పనులను బుధవారం రైతులు అడ్డుకున్నారు. పోలీసు బలగాల పహారాలో రెవెన్యూ, నేషనల్ హైవే అథారిటీ అధికారులు రోడ్డు నిర్మాణ పనులను చేపట్టడంతో బాధిత రైతులు బొల్లు రాజిరెడ్డి, సమ్మిరెడ్డి, తిరుపతిరెడ్డి, సమ్మిరెడ్డిలు స్వయంగా అడ్డుకున్నారు. తమకు బహిరంగ మార్కెట్ ధర చెల్లిస్తేనే వ్యవసాయ భూములను ఇస్తామని తెగేసి చెప్పారు. దీంతో పోలీసు ఉన్నతాధికారులు, బలగాల పహారాలో నేషనల్ హైవే అథారిటీ అధికారులు నిర్మాణ పనులను ప్రారంభించారు. అక్కడే వేచి ఉన్న బాధిత రైతులు వచ్చి ఎక్స్‌కవేటర్ సహాయంతో చేపట్టిన పనులను అడ్డుకున్నారు. తమ భూములకు సంబంధించిన విషయమై కోర్టులో కేసు నడుస్తోందని, తమ భూములను బలవంతంగా లాక్కుంటారా..? అంటూ అధికారులను, పోలీసులను నిలదీశారు. ప్రస్తుత బహిరంగ మార్కెట్ ధర ఎకరానికి రూ.4 కోట్లు చెల్లించాల్సిందేనని తెగేసి చెప్పారు. అలా కాకుండా ఎకరానికి రూ. 80 లక్షలు చెల్లిస్తామంటే ఊరుకోమని చెప్పారు. గతంలో ప్రభుత్వానికి అప్పటి జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తమ భూములకు ఎకరానికి రూ.3కోట్లు నుంచి రూ.4కోట్లు ధర పలుకుతోందని నివేదిక పంపారని, ఆ నివేదికను ఆధారంగా చేసుకుని తమకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మూడు పంటలు పండించుకునే పంట పొలాల నుంచి తమ అనుమతి లేకుండా బలవంతంగా రోడ్డు నిర్మాణ పనులను జరపడమేమిటని రైతులు ప్రశ్నించారు. పనులు చేస్తున్న ఎక్స్‌కవేటర్‌కు అడ్డుగా నిలిచారు.


పనులు చేస్తున్న ఎక్స్‌కవేటర్

దీంతో బాధిత రైతులకు పోలీసు, రెవెన్యూ అధికారుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. కాగా, రెవెన్యూ, పోలీసు అధికారులు కలుగచేసుకుని నచ్చచెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డీవో కె.నారాయణ, తహసీల్దార్ ఎం.జ్యోతివరలక్ష్మీదేవి, పరకాల రూరల్ సీఐ పి.రంజిత్‌రావు, దామెర ఎస్సై కొంక అశోక్, ఆర్‌ఐ ఎల్.భాస్కర్‌రెడ్డి, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ కస్టడీ నుంచి దొంగ పరార్

● ఎంజీఎం ఆస్పత్రిలో ఘటన ● వెతుకుతున్న కాజీపేట, మట్టెవాడ పోలీసులు

మట్టెవాడ జూన్ 11, (ఆంధ్రజ్యోతి): పోలీసుల కళ్లు గప్పి కస్టడీలో ఉన్న దొంగ పరారయ్యాడు. మట్టెవాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట మండలం కడిపికొండ ప్రాంతానికి చెందిన కట్కూరి సాయికుమార్‌ను దొంగతనం కేసులో కాజీపేట పోలీసులు అరెస్టు చేశారు. అతడిని రిమాండ్‌కు తరలించే క్రమంలో వైద్య పరీక్షల నిమిత్తం బుధవారం ఎంజీఎం ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో ఎస్కార్ట్ పోలీసుల కళ్లుగప్పి పారిపోయాడు. దీంతో కాజీపేట పోలీసులు బుధవారం రాత్రి మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడి కోసం మట్టెవాడ, కాజీపేట పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. నగరంలో సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు.

నలుగురు తహసీల్దార్ల బదిలీ

వరంగల్ కలెక్టరేట్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నలుగురు తహసీల్దార్‌లను బదిలీ చేస్తూ కలెక్టర్ సత్యశారద బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న ఎస్.రమేశ్‌ను ఖానాపూర్ తహసీల్దార్‌గా బదిలీ చేశారు. చెన్నారావుపేట తహసీల్దార్ పిఎస్.ఫణికుమార్‌ను ఆర్డీవో కార్యాలయ ఏవోగా, ఆర్డీవో కార్యాలయ ఏవోగా పని చేస్తున్న మహ్మద్ అబీద్ అలీని చెన్నారావుపేట తహసీల్దార్‌గా, నర్సంపేట నాయబ్ తహసీల్దార్ ఎ.రాజేశ్వర్‌రావును దుగ్గొండి (ఎఫ్ఏసీ) తహసీల్దార్‌గా బదిలీ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.


రాంచంద్రునాయక్‌ను సన్మానిస్తున్న జబర్దస్త్ నటుడు జీవన్

ప్రభుత్వ విప్‌ను కలిసిన నటుడు జీవన్

చిన్నగూడూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌ను బుధవారం చిన్నగూడూరు మండలం గుండంరాజుపల్లి గ్రామానికి చెందిన జబర్దస్త్ నటుడు జీవన్, ఎస్‌జే ప్రొడక్షన్ హౌజ్ మూవీ టీం సభ్యులు హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, మొక్కను అందించారు. డిప్యూటీ స్పీకర్‌గా ప్రకటించిన సందర్భంగా ఎస్‌జె మూవీ టీం సభ్యులు రాంచంద్రునాయక్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కష్ట పడ్డ సాంగ్ ఫేమ్ షాను షేక్ తదితరులు ఉన్నారు.

రైలు ఢీ ఒకరి మృతి


మృతుడు పేరబోయిన నాగరాజు

నెక్కొండ, జూన్ 11 (ఆంధ్ర జ్యోతి): నెక్కొండ రైల్వే స్టేషన్ సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద బుధవారం సాయంత్రం హైదరాబాద్ వెళ్తున్న ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని పేరబోయిన నాగరాజు (35) మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డులో మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం గుర్తూరుకు చెందిన పేరబోయిన నాగరాజు అని వివరాలు ఉన్నాయని హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. ప్రమాదానికి గల పూర్తికారణాలు తెలియాల్సి ఉందన్నారు. పంచనామ జరిపి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించామన్నారు.

నేటి నుంచి జేఎన్ఎస్‌లో విద్యుత్ ఉద్యోగుల క్రీడలు

రాంనగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులు పాటు తెలంగాణ ట్రాన్స్‌కో అండ్ డిస్కంల ఇంటర్ సర్కిల్ కబడ్డీ, బాల్‌బ్యాడ్మింటన్ టోర్నమెంట్స్ హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు, హనుమకొండ సర్కిల్ సూపరింటెండెంట్ పి.మధుసూదన్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి హాజరై క్రీడలను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ క్రీడలకు రాష్ట్రంలోని ట్రాన్స్ కో, డిస్కంల నుంచి సుమారు 20 టీంలు పాల్గొంటున్నట్లు స్పోర్ట్స్ కౌన్సిల్ నిర్వాహకులు తెలిపారు.

రేపటి నుంచి జాతీయ స్థాయి నాటక పోటీలు

వరంగల్ కల్చరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోతన విజ్ఞాన పీఠంలో ఈ నెల 13 నుంచి 15 వరకు జాతీయ స్థాయి నాటక పోటీలు ప్రదర్శిస్తున్నట్లు రంగస్థల కళాకారుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు కాజీపేట తిరుమలయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, ఐక్య వేదిక పరపతి సంఘం సభ్యుల సహకారంతో వరంగల్ జిల్లా రంగస్థల కళాకారుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో 16వ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమకాలీన అంశాలను ప్రతిబింబించే ఇతివృత్తంతో ఈనాటకాలు కొనసాగుతాయని, నాటక అభిమానులు, కవులు, కళాకారులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై నాటకాలను వీక్షించాలని కోరారు. జాతీయ స్థాయి నాటక పోటీలకు అఖిల భారత పద్మశాలీ సంఘం మాజీ అధ్యక్షుడు ఈగ మల్లేశం రాజపోషకులుగా వ్యవహరిస్తారని తెలిపారు.

కొప్పూర్‌లో అనుమతి లేని మందుల విక్రయాలు


కొప్పూర్‌లో మందులను సీజ్ చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు

భీమదేవరపల్లి, జూన్ 11 (ఆంధ్ర జ్యోతి): హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొప్పూర్ గ్రామంలో అనుమతి లేకుండా ఆర్ఎంపీ వైద్యుడు విలాసాగరం శ్రీనివాస్ మందులు విక్రయిస్తున్నట్లు హనుమకొండ, వరంగల్ జిల్లాల డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కొప్పూర్‌లో విలాసాగరం శ్రీనివాస్ అనే ఆర్ఎంపీ వైద్యుడు అనుమతులు లేకుండా మందులు విక్రయిస్తున్నాడని ఫిర్యాదు అందింది. ఈ మేరకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో రూ. లక్ష విలువ చేసే 71 రకాల మందులు లభించాయని, వాటిని సీజ్ చేశామన్నారు. శ్రీనివాస్‌పై 18సీ సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సంవత్సరం జనవరి 1నుంచి ఇప్పటి వరకు జిల్లాలో అనుమతులు లేకుండా మందులు విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేశామన్నారు. వీటి విలువ సుమారు రూ.7లక్షల వరకు ఉంటుందన్నారు. కాలం చెల్లిన మందులు, అనుమతులు లేకుండా విక్రయించడం నేరమన్నారు. పశు సంవర్ధక శాఖ, మనుషులకు సంబంధించిన అనుమతి లేని మందులు విక్రయిస్తే చట్టరీత్యా నేరమని, వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. దాడుల్లో బాలకృష్ణ, పావని, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్పోర్ట్స్ హాస్టల్ ప్రవేశాల ఎంపికలు


హాస్టల్‌లో ప్రవేశాల కోసం ఏర్పాటు చేసిన ఎంపిక పోటీలను పరిశీలిస్తున్న డీవైఎస్‌వో అశోక్‌కుమార్

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) ఆదేశాల మేరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో హనుమకొండ జేఎన్ఎస్‌లోని రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో ప్రవేశాలకు రెండు రోజులుగా జేఎన్ఎస్‌లో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఎంపిక పోటీలు బుధవారం ముగిశాయి. ఈ ముగింపు వేడుకల్లో డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. జేఎన్ఎస్‌లోని రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్లో ప్రవేశాల కోసం అండర్ -10, 12, 14, 16 బాలబాలికలకు జిమ్నాస్టిక్స్ హ్యాండ్‌బాల్, రెజ్లింగ్, అథ్లెటిక్స్, స్విమ్మింగ్ క్రీడావిభాగాల్లో నిర్వహించిన ఎంపిక పోటీల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి 400మంది పాల్గొన్నారు. ఇక్కడ నిర్వహించిన ఎంపిక పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి, ఎక్కువ మార్కులు సాధించిన క్రీడాకారుల పేర్లను సాట్‌కు పంపిస్తామన్నారు. తర్వాత సాట్ ఆదేశాలకు అనుగుణంగా ప్రతిభ కలిగిన క్రీడాకారులను హాస్టల్‌లో ప్రవేశం కోసం ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సాట్ అబ్జర్వర్లు డాక్టర్ రవికుమార్, నర్సింగరావు, స్వర్ణలత, సంతోష్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్, రెజ్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.డి. కరీం, స్విమ్మింగ్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి మంచాల స్వామిచరణ్, డీఎస్ఏ కోచ్‌లు నరేందర్, శ్రీమన్నారాయణ, దేవిక, అఫ్జల్, వెంకటేశ్వర్లు, జీవన్‌గౌడ్, నవీన్, శంకర్, రమేష్, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

‘టీ-ఫైబర్’కు చలనం

- మహిళా సంఘాలకే నిర్వహణ బాధ్యతలు
- స్త్రీనిధి ద్వారా రూ.4 లక్షల రుణం
- ఎల్‌వోసీలుగా మహిళల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- త్వరలో గ్రామాలకు హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలు
- జిల్లాలో 461 గ్రామ పంచాయతీలకు 1,200 కిలోమీటర్ల కేబుల్


అమినాపురంలో ఆరేళ్లుగా నిరుపయోగంగా ఉన్న టీ-ఫైబర్ హబ్

కేసముద్రం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ ఇంటర్నెట్, డిజిటల్ సేవలను అందించేందుకు రూపొందించిన ‘టీ-ఫైబర్’కు చలనం వచ్చింది. హైస్పీడ్ ఇంటర్నెట్‌ను అందించేందుకు ఏడేళ్ల క్రితం ఈ సంస్థ ద్వారా వైర్లు, పరికరాలు ఏర్పాటుచేసినప్పటికీ గత ప్రభుత్వం పట్టించుకోకుండా జాప్యం చేస్తూ రావడంతో గ్రామాల్లో ‘టీ-ఫైబర్’ సేవలు ప్రారంభం కాలేదు. జిల్లా వ్యాప్తంగా 2018లో మిషన్ భగీరథ పథకంలో తాగునీటి పైపులతోపాటు భూమిలో పైపులైన్లు(డక్ట్) వేశారు. తర్వాత ఈ డక్ట్‌లోంచి ఆప్టికల్ ఫైబర్ కేబుల్(ఓఎఫ్‌సీ)ను ఏర్పాటు చేసి అన్ని గ్రామాలను ఇంటర్నెట్‌తో కనెక్ట్ చేయాల్సివుంది. టీ-ఫైబర్ సేవలను గ్రామపంచాయతీని కేంద్రంగా చేసుకొని అందిస్తారు. ఇందుకోసం మహబూబాబాద్ జిల్లాలో 461 గ్రామపంచాయతీ కార్యాలయాలకు టీ-ఫైబర్ సేవలందించేందుకు కేబుళ్లను 2018, 2019లో వేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, విద్యాసంస్థలు, ఆస్పత్రులు, బ్యాంకులకు అధిక వేగంతో కూడిన బ్రాడ్‌బ్యాండ్ సౌకర్యాన్ని కల్పించడం ద్వారా ప్రభుత్వం నుంచి పౌరులకు (జీ2సీ), ప్రభుత్వం నుంచి ప్రభుత్వం(జీ2జీ)లో మెరుగైన సేవలను అందించడమే ‘టీ-ఫైబర్’ లక్ష్యం. పట్టణ ప్రాంతాల్లో అధికంగా వినియోగించే కేబుల్ ఇంటర్నెట్ సేవలను గ్రామస్థాయికి తీసుకువెళ్లేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని చేపట్టింది. ఈ నేపథ్యంలో కేబుల్ ద్వారా ప్రభుత్వం అందించే టీ-ఫైబర్ ఇంటర్నెట్ సేవల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు.

సిగ్నల్ లేక ఈ-సేవల్లో ఇబ్బందులు..

మహబూబాబాద్ జిల్లాలో ఏజెన్సీ ప్రాంతాలైన గంగారం, కొత్తగూడ, గూడూరు, బయ్యారం, ఇతర మండలాల్లోని కొన్ని ప్రాంతాల్లో కొండలు, గుట్టలు అడ్డుగా ఉండడంతో మొబైల్ సిగ్నల్ సరిగా అందడంలేదు. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలతోపాటు రేషన్ డీలర్లు, పోస్టల్ ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామపంచాయతీల్లో ‘ఈ-పంచాయతీ’లను ఏర్పాటు చేసినా వాటికి సరైన ఇంటర్నెట్ కనెక్షన్‌లేక అవి మూలకు పడ్డాయి. పల్లెల్లోనే అన్ని రకాల ప్రభుత్వ సేవలను అందేలా టీ-ఫైబర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పంచాయతీల్లో పూర్తి స్థాయి ఇంటర్నెట్ సేవలు టీ-ఫైబర్ ద్వారా అందించాల్సివుంది. టీ-ఫైబర్ ద్వారా ఈ-గవర్నెన్స్ ఈ-విద్య, ఓటీటీ, కేబుల్ టీవీ, వర్చువల్ డెస్క్‌టాప్, నిఘా(ఇల్లు, గ్రామం), టెలిమెడిసిన్, వీడియో కాన్ఫరెన్స్ సామాజిక వైఫై, క్యాంపస్ కవరేజ్ వైఫై తదితర సేవలు అందుబాటులోకి రానున్నాయి. రాజ్‌భవన్, ప్రగతి భవన్, టీ-ఫైబర్ కార్యాలయం, సచివాలయంతో స్టేట్ డేటా సెంటర్ ద్వారా గ్రామాలను అనుసంధానం చేస్తూ ఈ సేవలను కొనసాగించనున్నారు. తాజాగా టీ-ఫైబర్‌ను ఉపయోగిస్తూ డిజిటల్ సేవలన్నింటినీ ‘టీ-నెక్స్’ పేరుతో 1 గిగా బైట్ పర్ సెకండ్(జీపీపీఎస్) వేగంతో ఇంటర్నెట్‌ను అందిస్తూ అమలు చేయనున్నారు.


కేసముద్రంలో మిషన్ భగీరథ పైపులతోపాటు భూమిలో వేసేందుకు తీసుకువచ్చిన టీ-ఫైబర్ డక్ట్(పైల్)

2019లోనే పనులు పూర్తి..

జిల్లాలో మిషన్ భగీరథ పథకం పనులతోపాటే టీ-ఫైబర్‌కు సంబంధించిన గ్రిడ్ పనులను 2018, 2019లోనే పూర్తి చేశారు. తొలుత జిల్లా కేంద్రంలో ఇంటర్నెట్ సేవల కోసం ఇంటింటికీ డక్ట్‌ను సైతం వేశారు. జిల్లాలోని 18 మండలాల్లో 461 గ్రామాల్లో 1,104 వాటర్ ట్యాంకులు, 1,283.52 కిలోమీటర్ల పైపులైన్లు ఉన్నాయి. భూమిలో ఈ పైపులైన్లు వేసే సమయంలో వాటి వెంటే టీ-ఫైబర్ సేవలందించేందుకు ఆప్టికల్ ఫైబర్ కేబుల్(ఓఎఫ్‌సీ) డక్ట్‌ను వేశారు. ఈ కేబుళ్లతో తొలుత గ్రామపంచాయతీ కార్యాలయాలను అనుసంధానించారు. అక్కడ గ్రామంలోని ఇళ్లన్నింటికీ ఇంటర్నెట్ సేవలందించేందుకు హబ్ లాంటి పరికరాలను ఏర్పాటు చేశారు. ఈ హబ్‌కు నిరంతరాయంగా ఇంటర్నెట్ అందించాలనే ఉద్దేశంతో సోలార్ విద్యుత్‌ను అందించేందుకు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో సౌర పలకలను, బ్యాటరీలను ఏర్పాటు చేసి కనెక్షన్లు సైతం ఇచ్చారు. జీపీల్లో పరికరాలను ఏర్పాటు చేసి ఐదేళ్లు కావస్తున్నా నేటికి టీ-ఫైబర్ సేవలు జాడలేకుండా పోయాయి. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీ-ఫైబర్ సేవలను స్థానికంగా లోకల్ కేబుల్ ఆపరేటర్(ఎల్‌వోసీ)లకు అప్పగించేందుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఈనెల 10న చివరి తేదీతో స్వయం సహాయక సంఘాల్లోని మహిళల నుంచి ఎల్‌వోసీ కోసం దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నారు. ఎంపికైన మహిళలకు ఇంటర్నెట్ పంపిణీకి అవసరమయ్యే పరికరాల కొనుగోలు కోసం స్త్రీనిధి నుంచి రూ.4లక్షల రుణం ఇవ్వనున్నారు. ఎల్‌వోసీ ద్వారా తొలి దశలో ప్రభుత్వ కార్యాలయాలు, ఆ తర్వాత ఇంటింటికీ టీ-ఫైబర్ సేవలను అందించనున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో సైతం హైస్పీడ్ ఇంటర్నెట్ అందించే టీ-ఫైబర్ సేవలతో డిజిటల్ విప్లవం రాబోతోంది.

బడికి బదులు పనికి..

- వెట్టిచాకిరిలో బందీ అవుతున్న బాల్యం
- పేదరికంతో పుస్తకం పట్టని చిన్ని చేతులెన్నో..
- ఆపరేషన్ స్మైల్, ముస్కాన్‌తో చదువులమ్మ ఒడికి
- నేడు ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం


జనగామలో భవన నిర్మాణ పని వద్ద తనిఖీ చేస్తున్న ఆపరేషన్ ముస్కాన్ బృందం (ఫైల్)

జనగామ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పేదరికం, నిరక్షరాస్యత చిన్నారుల జీవితాలను అంధకారంలోకి నెడుతున్నాయి. పుస్తకం చేతబట్టి చదువులమ్మ ఒడిలో ఆడుతూ పాడుతూ గడపాల్సిన బాలలు కార్మికులుగా మగ్గిపోతున్నారు. చిన్న వయస్సులోనే బరువులు మోస్తూ కూలీలుగా మారుతున్నారు. తమ ఈడు పిల్లలతో చదుకోవాల్సిన చిన్నారులు జీవనోపాధి కోసం శ్రమించాల్సి వస్తోంది. బడిలో పాఠాలు నేర్చుకోవాల్సిన బాలలు పనిలో కార్మికులుగా మిగిలిపోతున్నారు. చట్టాలు ఎన్ని వచ్చినా బాల కార్మికులు ఎక్కడో ఒక చోట మిగిలిపోతూనే ఉన్నారు. చిన్నారి చేతులకు వెట్టి చాకిరి నుంచి విముక్తిని కల్పించి బడికి బాటలు వేసేలా చేయాల్సిన ఆవశ్యకత ఉంది. నేడు(గురువారం) ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

పేదరికంతో విద్యకు దూరం

పిల్లలు బాల కార్మికులుగా మారడానికి ప్రధానంగా పేదరికం, తల్లిదండ్రులు నిరక్షరాస్యులు కావడం, చదువుకోవడానికి అనుకూలతలు లేకపోవడం, పిల్లల పెంపకం కుటుంబానికి భారం కావడం కారణాలుగా ఉన్నాయి. నేటి ఆధునిక సమాజంలో చాలా కుటుంబాలు పేదరికంలోనే మగ్గుతున్నాయి. ప్రభుత్వాలు ఎన్ని సంక్షేమ పథకాలు పెట్టినా పేదలు, పేదలుగానే మిగిలిపోతున్నారు. గ్రామీణ ప్రాంతాలకు తోడు పట్టణ ప్రాంతాల్లోనే నిరక్ష్యరాస్యత శాతం ఎక్కువగానే ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశ అక్షరాస్యత రేటు 72.98 ఉండగా తెలంగాణ అక్షరాస్యత 66.54 శాతంగా ఉంది. జనగామ జిల్లా వరకు చూస్తే 61.44 శాతంగా ఉంది. ఈ లెక్కలను బట్టి చూస్తే దాదాపు 35 శాతానికి పైగా నిరక్షరాస్యులు ఉన్నట్లే లెక్క. తల్లిదండ్రులు నిరక్షరాస్యులు కావడం, పేదరికంతో కొట్టుమిట్టాడుతుండడంతో వారికి పిల్లల చదువు కంటే పనిలో పెట్టడమే తక్షణ కర్తవ్యంగా భావిస్తున్నారు.

పనిలో పెట్టుకుంటే కఠిన శిక్షలు

బాల కార్మిక నిషేధం, నియంత్రణ చట్టం (1986, సవరణ చట్టం 2016) ప్రకారం 14 ఏళ్ల లోపు వయస్సు వారు పని చేస్తే బాల కార్మికులుగా వ్యవహరిస్తారు. ఈ వయస్సులోపు ఉన్న వారికి పనిలో పెట్టుకుంటే యజమానులకు కఠిన శిక్ష విధించే అవకాశం ఉంది. బాల కార్మిక చట్టంలో భాగంగా ప్రమాదకరమైన, ప్రమాదకం కాని పనులుగా విభజించారు. 14 ఏళ్ల లోపు బాలలతో ఏ పని చేయించకూడదు. 14 నుంచి 18 ఏళ్ల మధ్య కౌమార బాలలతో ప్రమాదకరమైన పనులు చేయించవద్దని చట్టంలో నిర్ధేశించారు. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే యజమానులకు ఆరు నుంచి 2 సంవత్సరాల వరకు జైలు లేదా రూ. 20 వేల నుంచి రూ. 50 వేల వరకు జరిమానా పడొచ్చు లేదా ఈ రెండింటినీ విధించవచ్చు. తిరిగి అదే తప్పు చేస్తే మూడేళ్ల వరకు కచ్చితమైన జైలు శిక్ష పడే అవకాశం ఉంది.

బడి వదిలి పనికి..

ఆడుతూ పాడుతూ చదుకోవాల్సిన పిల్లలు పేదరికం కారణంగా బాల కార్మికులుగా మారుతున్నారు. ఆర్థిక కారణాలతో హోటళ్లు, ఇటుక బట్టీలు, బస్సు, రైల్వే స్టేషన్లు, చాయ్ దుకాణాలు, భవన నిర్మాణ పనుల్లో, మైనింగ్, పరిశ్రమలు, చిన్నపాటి కర్మాగారాల్లో కూలీలుగా మారుతున్నారు. ఇందులో ఎక్కువగా పేద వర్గానికి చెందిన పిల్లలే కాకుండా తప్పిపోయిన పిల్లలు, తల్లిదండ్రులు చనిపోయి అనాథలుగా మారిన పిల్లలు ఎక్కువగా ఉండడం ఆందోళన కల్గించే అంశం. తల్లిదండ్రులు కోల్పోయి, తప్పిపోయిన పిల్లలు, పేదరికంలో మగ్గుతున్న పిల్లలను బాల కార్మికులుగా మారకుండా చూడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉంది. గురువారం ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రతిఒక్కరూ ప్రతిన బూనాల్సిన అవసరం ఉంది. బాల కార్మిక వ్యవస్థను రూపుమాపడంతో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలు సత్ఫలితాలిస్తున్నాయి. జనగామ జిల్లాలో గడిచిన ఎనిమిదేళ్ల కాలంలో అనగా 2017 నుంచి 2025 వరకు 654 మంది బాల కార్మికులకు విముక్తి కలిగింది. ఇందులో 558 బాలురు ఉండగా 96 మంది బాలికలు ఉన్నారు. ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం, కార్మిక, విద్య, పోలీస్ శాఖలు, చైల్డ్ హెల్ప్‌లైన్, మహిళల రక్షణ విభాగాలు సంయుక్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.


గోవిందరావుపేటలో జరిగిన రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

భూ భారతితో ప్రతి రైతుకు న్యాయం

- అధికారులు తప్పు చేస్తే చర్యలు తప్పవు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

గోవిందరావుపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రైతుల భూ సమస్యలను పరిష్కరించడానికి ప్రజా ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని ప్రవేశ పెట్టిందని, ఈ చట్టం ద్వారా ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం గోవిందరావుపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగిన భూ భారతి అవగాహన సదస్సులో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయసీతక్క, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, ములుగు కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ శబరీశ్‌లతో కలిసి పాల్గొన్నారు. ముందుగా ఆయన భూ సమస్యల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత పాలకులు తెచ్చిన ధరణి చట్టంతో రైతులు అనేక ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఈ చట్టంలో ప్రతి సమస్యను పరిష్కరించుకునేందుకు వీలు కల్పించిందని చెప్పారు. అర్హులైన వారందరికీ అండగా ఉండేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ప్రతి రైతుకు న్యాయం చేయడానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని, అధికారులు తప్పు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మంత్రి సీతక్క మాట్లాడుతూ వ్యవసాయం చేస్తున్న ప్రతి రైతుకు పట్టాలు అందించాలన్న ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి అనేక అంశాలతో భూ భారతి చట్టాన్ని పొందుపరిచారని, చట్టం అమలుపై రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో మొదటి విడతలో పైలెట్ ప్రాజెక్టులుగా తీసుకుని విజయవంతం చేశారని అన్నారు. రెండో విడతలో హైదరాబాద్ మినహా మిగతా 28 జిల్లాల్లోని 28 మండలాలను పైలెట్‌గా ఎంపిక చేశామని చెప్పారు. తొలి విడతలో ములుగు జిల్లా వెంకటాపూర్ మండలాన్ని ఎంపిక చేసి ప్రజల నుంచి 4,100 దరఖాస్తులు స్వీకరించామని, ఇప్పటి వరకు 2వేలకు పైగా సమస్యలను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని రైతులందరికీ భూములపై హక్కులు పొందడానికి ఈ చట్టం ఎంతగానో దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ఆగస్టు 15 నాటికి రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆమె వెల్లడించారు. భూ భారతి చట్టం ద్వారా తహసీల్దార్, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలోనే సమస్యలు పరిష్కరిస్తామని, కలెక్టర్ వద్ద సాధ్యం కాకపోతే సీసీఎల్‌ఏలో ఫిర్యాదు చేయవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్.మహేందర్‌జీ, సంపత్‌రావు, ఆర్డీవో వెంకటేష్, సంబంధిత శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధం

- ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాల ఏర్పాటు
- వరదల సమయంలో తక్షణ స్పందన
- అందుబాటులో అధునాతన పరికరాలు, వాహనాలు



రెస్క్యూ టెండర్ వాహనం


బోటు, ఏరియా లైట్లు


ఎస్‌డీఆర్‌ఎఫ్ వినియోగించే పరికరాలు

మట్టెవాడ(వరంగల్), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వరదలు, విపత్తులను ఎదుర్కొనేందుకు, తక్షణ సహాయ చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉంటాయి. వీటిని అగ్నిమాపక శాఖ ఏర్పాటు చేసింది. ఫైర్ స్టేషన్ల వారిగా సిబ్బందిని ఎంపిక చేసి 10 మంది చొప్పున 24గంటల పాటు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ ఫైర్ స్టేషన్లలో పనిచేస్తున్న సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. మొత్తం 60 మంది సిబ్బంది వర్షాకాలంలో రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నారు. వరంగల్ జిల్లాలో అకస్మిక వరదలు భారీవర్షాల సమయంలో బాధితులను ఆదుకునేందుకు, సహాయ చర్యల కోసం ప్రత్యేక శిక్షణను పొందారు.

వరదల సమయంలో బాధితులను రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రత్యేక వాహనాలను సిద్ధంగా ఉంచారు. అదే విధంగా అనేక రకాల అధునాతన పరికరాలను వినియోగించడంతో ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. భారీ వృక్షాలు పడిపోయినప్పుడు, రోడ్లు కట్టింగ్ చేసేందుకు ప్రత్యేక కట్లర్లను వినియోగించనున్నారు. వరదల సమయంలో బోట్ల ద్వారా లోతట్టు ప్రాంతాలకు వెళ్లేందుకు బోట్లను సిద్ధంగా ఉంచారు. వరదల సమయంలో ప్రజల ప్రాణాలను రక్షించేందుకు లైఫ్ బాయ్స్ లైఫ్ జాకెట్లు, రోప్‌లు, రెస్క్యూ ట్యూబ్‌లు, ఏరియా లైటింగ్ సిస్టం, జనరేటర్, రోడ్డు కట్టర్, రేయిన్‌కోట్లు, బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు మినీ వ్యాన్లు, ట్రక్కులను వినియోగించనున్నారు.

అధునాతన పరికరాలు సిద్ధం

పడవలు 3, లైఫ్‌బాయ్స్ 100, లైఫ్ జాకెట్లు 50, రోప్స్ -30, ఏరియా లైటింగ్ సిస్టం-2, జనరేటర్లు, పిడ్డర్, కట్టర్లు-2, డీసీఎం వ్యాన్-1, ట్రక్కు-1, మినీవ్యాన్-1తోపాటు స్ట్రెచర్, జనరేటర్లు తదితర పరికరాలు అందుబాటులో ఉంచారు.


RAHUL GANDHI
LEADER OF OPPOSITION
LOK SABHA

9th June, 2025

Dear Dr. Kancha Ilaiah,

I am sorry to hear about the passing of your brother Shri Kancha Kattaiah. Our siblings are often our first friends and confidantes. Their love and support help us navigate life at its hardest. I am sure that your brother's wisdom and affection will continue to guide you.

I can imagine your anguish and sorrow at losing him. Please accept my heartfelt condolences. My thoughts and prayers are with you and your family in this difficult time.

Sincerely,

రాహుల్ గాంధీ పంపిన సంతాప సందేశ పత్రం

ప్రొఫెసర్ కంచ ఐలయ్యకు రాహుల్ గాంధీ సంతాప సందేశం

చెన్నారావుపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాపయ్యపేట గ్రామానికి చెందిన ప్రొఫెసర్ కంచ ఐలయ్య సోదరుడు కంచ కట్టయ్య ఈ నెల 7న గుండె పోటుతో మృతి చెందగా, లోక్‌సభ ప్రతి పక్ష నాయకుడు రాహుల్ గాంధీ సంతాప సందేశాన్ని బుధవారం పంపించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

రిలయన్స్ గుప్పిట్లోకి పశుగ్రాసం

- టన్నుల కొద్దీ సేకరిస్తున్న ఇండస్ట్రీ
- యంత్రాలతో నేరుగా పొలాల వద్దకే రాక
- తక్కువ ధరకే గంపగుత్తగా కొనుగోళ్లు
- పశువులకు కరువవుతున్న వరిగడ్డి
- పాల పరిశ్రమకు పొంచి ఉన్న ముప్పు


రైతు పొలాల్లో రిలయన్స్ ఇండస్ట్రీ యంత్రాలు కట్టిన వరి గడ్డి కట్టలు

ఎల్కతుర్తి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ ఆధారిత రైతులు ప్రత్యామ్నాయంగా పాడి పశువుల పోషణతో ఆర్థికాభివృద్ధి సాధించే వారు. వ్యవసాయంలో యాంత్రికణరణ వినియోగం పెరగడంతో పశు పోషణ భారమైంది. కేవలం పాల ఉత్పత్తిపై ఆధారపడిన రైతులు తమ వ్యవసాయ పొలాల్లో లభించే వరి గడ్డిని నిల్వ చేసుకుని పశువులకు గ్రాసంగా ఉపయోగించుకుని పశు పోషణ చేస్తున్నారు. మెట్ట ప్రాంతానికి చెందిన పశువుల పెంపకం దారులు ఈ ప్రాంతం నుంచి పశుగ్రాసాన్ని కొనుగోలు చేసేవారు. దీంతో పశువులకు కావలసినంత పశుగ్రాసం ఎల్కతుర్తి మండల పరిధిలోని ఏ గ్రామానికి వెళినా అందుబాటులో ఉండేది. కానీ ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామ శివారులో ఇటీవల రిలయన్స్ ఇండస్ట్రీ బయో ఎనర్జి గ్యాస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. గ్యాస్ తయారీకి వరి గడ్డి అవసరం ఉండడంతో రైతుల వద్ద భారీగా గడ్డిని సేకరించి నిల్వ చేస్తున్నారు. దీంతో పశు పెంపకం దారులకు పశుగ్రాసం కొరత ఏర్పడింది. ఎల్కతుర్తి మండల పరిధిలోని ఎల్కతుర్తి, బావుపేట, తిమ్మాపూర్, కేశవపూర్, గుంటూర్‌పల్లి, దండేపల్లి, వీరనారాయణపూర్, సూరారం, గ్రామాలు పూర్తిగా ఎస్సారెస్పీ ప్రధాన కాలువకు దిగువన ఉన్నాయి. ఈ ప్రాంతంలో ప్రధాన పంటలుగా పూర్తి విస్తీర్ణంలో వరి పంటలను సాగు చేస్తున్నారు. సంవృద్ధిగా పంటలు పండడంతో కావలసినంత పశుగ్రాసం అందుబాటులో ఉంటుంది. మెట్ట ప్రాంతానికి చెందిన రైతులు, పాల డైయిరీలకు చెందిన వ్యాపారులు ఈ ప్రాంతం నుంచి ఎక్కువగా వరి గడ్డిని రైతుల వద్ద కొనుగోలు చేసేవారు. దీంతో పశు పెంపకం దారులకు పశుగ్రాసం కొరత లేకుండా ఉంటుంది.

దక్కని గిట్టుబాటు ధర

రైతులు వరి పంట సాగు చేయగా కోత అనంతరం వచ్చిన గడ్డిని వాములుగా నిల్వ చేసుకుని గిట్టు బాటు ధరలకు విక్రయించుకుని ఆదాయం పొందేవారు. రిలయన్స్ ఇండస్ట్రీ నిర్వాహకులు భారీ యంత్రాలతో నేరుగా రైతు పొలంలో సుమారు రెండు క్వింటాళ్ల బరువు ఉన్న వరి కట్టలు ప్రత్యేక మిషన్‌ల ద్వారా కడుతున్నారు. ఒక్క వరి గడ్డి కట్టకు రైతుకు రూ. 50 మాత్రమే చెల్లించి తీసుకెళ్తున్నారు. ఒక ఎకరంలో సుమారు 10 నుంచి 12 వరి గడ్డి కట్టలు తయారు చేస్తున్నారు. దీంతో రైతుకు సుమారుగా రూ. 500 నుంచి వెయ్యి లోపు వరకు మాత్రమే గిట్టుబాటు అవుతుంది.

టన్నుల కొద్దీ సేకరణ

ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామ శివారులో రిలయన్స్ బయో ఎనర్జి గ్యాస్ ఉత్పత్తి ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. గ్యాస్ ఉత్పత్తి కోసం వరి గడ్డి పెద్ద మొత్తంలో అవసరం ఉండడంతో ఎల్కతుర్తి మండల పరిధిలోని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున వరి గడ్డిని సేకరిస్తున్నారు. రబీలో పండిన వరి గడ్డిని రిలయన్స్ ఇండస్ట్రీ నిర్వహకులు మొదటి సారిగా వరి గడ్డిని సేకరించించే పనిలో పడ్డారు. గ్రామాల్లో సేకరించిన వరి గడ్డి కట్టలను ఇండస్ట్రీకి తరలించి నిల్వ చేస్తున్నారు. దీంతో పశువులకు పశుగ్రాసం కొరత తీవ్ర స్థాయిలో నెలకొననుంది.

ఉపాధి కోల్పోతున్న ట్రాక్టర్ యాజమానులు

వరి గడ్డి కట్టలు కట్టడానికి గ్రామాల్లో ట్రాక్టర్ యాజమానులు లక్షలు వెచ్చించి గడ్డి కట్టల యంత్రాలను కొనుగోలు చేశారు. రైతులకు అందుబాటులో ఉంటు గడ్డి కట్టలు కట్టి ఆదాయం పొందుతున్నారు. ప్రస్తుతం రిలయన్స్ ఇండస్ట్రీ భారీ యంత్రాలతో గడ్డి కట్టలు కట్టడంతో పాటు వారే స్వయంగా తీసుకెళ్లడంతో ట్రాక్టర్ యాజమానులు ఉపాధి కోల్పోతున్నారు. లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన యంత్రాలు మూలకు పడి ఉపాధి కొల్పోతున్నారు.

పోలీసుల కొరడా..

ఎల్కతుర్తి నుంచి వరి గడ్డి కట్టలను మెట్ట ప్రాంతాలకు, డెయిరీ ఫాంలకు స్థానిక ట్రాక్టర్‌ల ద్వారా తరలిస్తుండగా వాటిని పోలీసులు పట్టుకుని ఇబ్బందులకు గురి చేస్తున్నట్టు ట్రాక్టర్ యాజమానులు ఆరోపిస్తున్నారు.

గతంలో ఏ ప్రాంతానికి గడ్డిని తరలించిన పోలీసులు వాహనాలను అడ్డుకునే వారు కాదని పేర్కొన్నారు. రిలయన్స్ ఇండస్ట్రీ గడ్డి సేకరిస్తున్నప్పటి నుంచి పోలీసులు గడ్డి కట్టలు తరలించకుండా వాహనాలను అడ్డుకుని ఫైన్‌లు వేస్తున్నారని ఆరోపిస్తున్నారు. రిలయన్స్ నిర్వహకులు గడ్డిని ఇతర ప్రాంతాలకు తరలించకుండా ఉండేందుకు పోలీసులచే వాహనాలను అడ్డుకుని ఫైన్‌లు వేయిస్తున్నారని ట్రాక్టర్ యాజమానులు ఆరోపిస్తున్నారు.

రూల్స్ జాన్తానై..

- ప్రజాప్రతినిధులు, అధికారుల అండదండతో ఇసుక అక్రమ రవాణా..?
- వే బ్రిడ్జీల వద్ద చెక్ పోస్టులు కరువు
- ఓవర్ స్పీడ్‌తో ప్రమాదాలు...
- మృత్యువాత పడుతున్న మూగజీవాలు
- ఇసుక లారీలతో తరుచూ ట్రాఫిక్ జామ్

ములుగు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాకు అడ్డు, అదుపు లేకుండా పోతుంది. పలు క్వారీల నిర్వాహకులు ప్రజా ప్రతినిధులు, అధికారులతో కుమ్మక్కై ఇష్టారీతిన ఇసుక తోడేస్తున్నారు. నిబంధనలను తుంగలో తొక్కి పర్మిషన్ లేని లారీలలో ఇసుక నింపుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కొందరు వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా జీరో దందా సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. లారీలలో పరిమితికి మించి ఇసుక తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి పెడుతున్నారు. ఇదిలా ఉండగా లారీ డ్రైవర్లు మితిమీరిన వేగంతో నడుపుతూ ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇసుక లారీల మూలంగా జాతీయ రహదారిపై తరచూ ట్రాఫిక్ జామవుతుంది. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లారీలు అతి వేగంతో వచ్చి ఢీ కొట్టడంతో ప్రజలు, మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంపట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా

ఇసుక క్వారీలలో మైనింగ్ పనులు చేట్టాలంటే పలు నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. అయితే జిల్లాలో కొందరు రేజింగ్ కాంట్రాక్టర్లు వారికేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక తవ్వకాలు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు తవ్వకాలు చేపట్టవచ్చని కేంద్ర ప్రభుత్వం మార్గ దర్శకాలు చెబుతున్నాయి. ఇందుకు కాస్త వెసులు బాటు కల్పిస్తూ టీజీఎండీసీ రాత్రి 9 గంటల వరకు తవ్వకాలు నిర్వహించవచ్చని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అలాగే 2 మీటర్ల లోతు కన్నా ఎక్కువ తోడకూడదనే నిబంధన కూడా ఉంది. వీటితో పాటు ఓవర్‌లోడ్, పెసా చట్టం అమలు వంటి నిబంధనలు ఉన్నాయి. లారీలలో ఇసుక నింపించడం ద్వార అక్కడున్న ప్రజలకు కాస్త జీవనోపాధి దొరుకుతుంది.

అయితే పలువురు కాంట్రాక్టర్లు అవేవి తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తూ జేసీబీలు, ప్రొక్రేనర్లను పెట్టి లారీలలో ఇసుక నింపిస్తూ మా పొట్ట కొడుతున్నారని పలు ఆదివాసి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. లారీల్లో అదనపు బకెట్ వేస్తూ టన్నుకు అదనంగా డబ్బులు వసూల్ చేస్తున్నారని, దీంతో ప్రభుత్వం ఆదాయానికి గండి పడుతుందని వారు చెబుతున్నారు. గతంలో వే బ్రిడ్జీల వద్ద అధికారులు చెక్ పోస్టులు ఏర్పాటు చేశారని, అయితే ప్రస్తుతం వాటిని తొలగించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ తతంగమంతా కొందరు అధికారుల కనుసన్ననలోనే జరుగుతుందని అంటున్నారు. ఇసుకను నిబంధనలకు మించి లోడ్ చేయడానికి లేదు. అయితే కొన్ని చోట్ల పలువురు కాంట్రాక్టర్లు అదనపు బకెట్ల పేరిట వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీస్, రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు రాత్రి సమయంలో క్వారీల వద్ద ఉండక పోవడంతో అదనపు బకెట్ దందాకు తెరలేపి సొమ్ము చేసుకు ంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు షెడ్యూల్ తెగలకు చెందాల్సిన హక్కులను వారి అధికారంతో దక్కించుకుంటున్నారని చెబుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇసుక మైనింగ్ గిరిజన సొసైటీల ద్వారా మాత్రమే జరపాలని, అలాంటిది టెండర్లకు పిలిచి కాంట్రాక్టర్లకు అప్పగించడంతో వారు లాభపడుతున్నారని, దీంతో పెసా చట్టం లక్ష్యం నీరుగారి పోతుందని అంటున్నారు.

ఓవర్ స్పీడ్‌తో ప్రమాదాలు

ములుగు జిల్లాలోని తాడ్వాయి, వాజేడు, వెంకటాపురం, మంగపేట మండలాల నుంచి నిత్యం వందలాది లారీలలో హైదరాబాద్, హన్మకొండ, వరంగల్ తదితర ప్రాంతాలకు ఇసుకను తరలిస్తుంటారు. కాగా 12 టైర్స్ లారీలో 26 టన్నులు, 14 టైర్ల లారీలో 32 టన్నుల ఇసుకను మాత్రమే తీసుకెళ్లాల్సి ఉంటుంది. అయితే పరిమితికి మించి ఇసుకను నింపుకుని ఓవర్ స్పీడ్‌తో వెళ్తున్న క్రమంలో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో మూగజీవాలు, ప్రజలు మృత్యువాత పడుతున్నారు.


ఇసుక లారీ ఢీ కొట్టడంతో మృతి చెందిన రవికిరణ్ (ఫైల్ ఫొటో)

ఇటీవలి ప్రమాదాలు..

ములుగు జిల్లా 163వ జాతీయ రహదారి వెంట ప్రయాణిస్తున్న ఇసుకు లారీల వల్ల తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ప్రజలతో పాటు మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయి. అందులో కొన్ని ప్రమాదాల వివరాలు.. జనవరి 2న మంగపేట మండలం కమలాపూరంలో ఇసుక లారీ ఢీ కొనడంతో దోమల నర్సయ్యకు చెందిన రెండు గేదెలు మృతి చెందాయి. ఫిబ్రవరి 6న కమలాపురం ఆర్ఎంసీ చర్చి సమీపంలో ఇసుక లారీ ఢీకొట్టడంతో నిమ్మల సత్తమ్మకు చెందిన రెండు సూడి గేదలు మృత్యువాత పడ్డాయి. ఏప్రిల్ 23న ఏటూరునాగారం మండలంలోని జంపన్నవాగు రెండో బ్రిడ్జివద్ద ఇసుక లారీ అతివేగంతో వచ్చి ఢీ కొట్టడంతో వెంకటాపురం మండలం బస్తగూడెం గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనదారుడు రవికిరణ్ మృతి చెందాడు. మరో వ్యక్తి రవిశంకర్ తీవ్రంగా గాయపడ్డాడు. మే 2న ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి వద్ద వేగంగా దూసుకువస్తున్న ఇసుక లారీని తప్పించబోయిన ఆటో ఆర్టీసీ బస్సును ఢీ కొట్టడంతో ఒక వ్యక్తి కాలు విరిగింది, మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి.

అదే నెల 18న తాడ్వాయి మండల కేంద్రంలో 163 జాతీయ రహదారి పక్కకు నిలిపి ఉన్న ట్రాక్టార్‌ను వేగంగా వచ్చిన ఇసుకలారీ ఢీ కొట్టడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపేరం మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన ఉప్ప దుర్గ, చేతుపల్లి సీత మరణించారు. 25 మందికి పైగా గాయపడ్డారు. అదె నెల 30న ఏటూరునాగారం మండలం జీడివాగు వద్ద ఇసుక లారీ ఢీ కొట్టడంతో రెండు పాడి గేదలు అక్కడికక్కడే మృతిచెందాయి. ఈ నెల 1న అదే మండలంలోని చిన్నబోయినపల్లిలో ఇసుక లారీ ఢీ కొట్టడంతో ఒక పాడిగేదె మృత్యువాత పడింది. ఈ నెల 5న అదే మండల కేంద్రంలో ఇసుక లారీ ఢీ కొట్టడంతో గేదె మరణించింది. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా లారీ డ్రైవర్లు నిర్లక్ష్యంగా వెళ్తుంటే ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఇలాంటి ప్రమాదాలతో ప్రజలు విసిగి వేసారుతుంటే.. నిత్యం గంటల తరబడి ట్రాఫిక్ జామై వాహనదారులు, ప్రయాణిలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టవేసి, లారీలను కట్టడి చేసి ప్రమాదాలను అరికట్టాలని, ట్రాఫిక్ జామ్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నేడు బడులు పునఃప్రారంభం

- జిల్లా వ్యాప్తంగా 551 పాఠశాలలు
- బడులకు చేరిన పాఠ్యపుస్తకాలు
- పూర్తిస్థాయిలో చేరని ఏకరూప దుస్తులు



కన్నాయిగూడెం మండలంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల


వాజేడు మండలంలో అసంపూర్తిగా ఉన్న వంటగదులు

ములుగు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రెండు నెలల విరామం తర్వాత గురువారం నుంచి బడి గంట మోగనుంది. వేసవికాలం సెలవులు ముగియడంతో విద్యాశాఖ అధికారులు పాఠశాలలను పునఃప్రారంభించేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో ములుగు జిల్లా వ్యాప్తంగా 551 ప్రభుత్వ,ప్రైవేటు, ఆదర్శ, గురుకులాలు ఉన్నాయి. దీంతో 22వేల మంది విద్యార్థులు బడిబాట పట్టనున్నారు. జిల్లాలోని పలు పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు సక్రమంగా లేకపోవడం, నీటి ట్యాంకులు నిరుపయోగంగా ఉండడం, తరగతి గదులు సరిగ్గా ఉండకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉంది.

పాఠశాలలకు చేరిన పాఠ్యపుస్తకాలు

సర్కారు బడులకు పాఠ్యపుస్తకాలు ముందస్తుగానే చేరాయి. కాగా, గురువారం పాఠశాలల పునఃప్రారంభం నేపథ్యంలో విద్యార్థులకు పుస్తకాలు అందజేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 510 ప్రభుత్వ పాఠశాలలకు అన్ని తరగతులతో కలిపి 1,61,130 పుస్తకాలు రావాల్సి ఉండగా 1,49,070 పుస్తకాలు వచ్చినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు.

పూర్తిగా అందని ఏకరూప దుస్తులు

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అదే ఏకరూప దుస్తులు పూర్తిగా జిల్లాకు చేరుకోలేదు. విద్యార్థులకు రెండు జతల దుస్తులు అందించాల్సి ఉండగా ఒక విద్యార్థికి ఒక జత చొప్పున మాత్రమే జిల్లాకు చేరుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. మిగతా మరో జత మాత్రం రెండో విడత పంపిణీలో అందిచనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

సమస్యల్లో పలు పాఠశాలలు

పాఠశాలలు పునఃప్రారంభం కానుండగా కొన్నిపాఠశాలల్లో పలు అభివృద్ధి పనులు అలాగే నిలిచిపోయాయి. వాజేడు మండలంలోని పలు పాఠశాలల్లో వసతులు అరకొరగా ఉన్నాయి. గత ఏడాది 'మన ఊరు-మన బడి' కింద మంజూరైన నిధులతో చేపట్టిన పనులు నేటికి పూర్తి కాలేదు. మరుగుదొడ్లు అస్తవ్యస్తంగా ఉండగా, నీటి వసతి లేనే లేదు. అంతేకాకుండా కన్నాయిగూడెం మండలంలోని చింతగూడెం, సింగారం, కొత్తూరు ప్రాథమిక పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షాలు పడితే బడికి సెలవు తప్పదని అంటున్నారు.

తహసీల్ ఆఫీస్‌ను తనిఖీ చేసిన మంత్రులు

గోవిందరావుపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయసీతక్కలు బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వారు కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. వారి వెంట మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, కలెక్టర్ దివాకర, ఆర్డీవో వెంకటేష్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

నగరంపల్లిలో చోరీ

- 2లక్షల నగదు, 10 తులాల బంగారం అపహరణ

గణపురం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన మండలంలోని నగరంపల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని ఆకుల కట్టయ్య భార్యతో కలిసి సోమవారం బంధువుల ఇంటికి వెళ్లినట్లు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఇంటికి చేరుకునే సరికి తాళం పగలకొట్టి ఇంట్లో ఉన్నబీరువాను కూడా ధ్వంసం చేసినట్లు పేర్కొన్నాడు. పోలీసులకు వెంటనే సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఇంట్లో బీరువాలో పంట పెట్టుబడి కోసం దాచిన రూ.2లక్షల నగదు, 10 తులాల బంగారం అపహరణకు గురైందని బోరున విలపించాడు. కాగా, సంఘటన స్థలాన్ని క్లూస్ టీం పోలీసులు పరిశీలించి నమూనాలను సేకరించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పది మందికి జైలుశిక్ష

వెంకటాపూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి వాహనాలు నడిపిన పది మందికి జైలుశిక్ష పడినట్లు స్థానిక ఎస్సై జక్కుల సతీష్ తెలిపారు. ఇటీవల మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించగా 22 మందిపై కేసులు నమోదు అయ్యాయని అన్నారు. బుధవారం ములుగు జిల్లాకోర్టులో వారిని హాజరుపరచగా జడ్జి 22 మందికి రూ.34,500 జరిమానా విధించారని, 8 మందికి ఒకరోజు జైలుశిక్ష, మరో ఇద్దరికి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు పేర్కొన్నారు. ఎవరు కూడా మద్యం సేవించి వాహనాలు నడుపొద్దని ఆయన సూచించారు.

ఇసుక లారీ ఢీకొని ఆరు పాడిగేదెలు మృతి

ఏటూరునాగారం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నబోయినపల్లి-తాడ్వాయి 163వ జాతీయ రహదారిపై బుధవారం ఇసుక లారీ ఢీకొని ఆరు పాడి గేదెలు మృతి చెందాయి. చిన్నబోయినపల్లి గ్రామానికి చెందిన ఎస్‌కె.ఖాసీంకు చెందిన ఒక గేదె, ఎస్‌కె.మౌలాన్‌కు చెందిన రెండు, అర్వేపల్లికి చెందిన ఒక పాడిగేదెతో పాటు మంగ రాజుకు చెందిన ఒకటి, చేల సమ్మయ్యకు చెందిన ఒక దున్న మొత్తం ఆరు గేదెలు రోజు వారిగా ఉదయం మేత కోసం వెళ్తూ రోడ్డు దాడుతున్నాయి. ఈ క్రమంలో ఏటూరునాగారం వైపు నుంచి హనుమకొండ వైపు ఇసుక లోడ్‌తో వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి ఒకే దగ్గర ఉన్న గేదెలను ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలతో గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఆ గేదెల విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు. కాగా, ప్రభుత్వం తమను ఆదుకొని నష్టపరిహారం అందించాలని పశువుల యజమానులు కోరారు.

16 మందికి కారుణ్య నియామక పత్రాలు అందజేత

కృష్ణకాలనీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి సింగరేణి ఏరియా పరిధిలో నూతనంగా 16 మందికి ఉద్యోగ నియామక పత్రాలను సింగరేణి ఏరియా జీఎం ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నూతనంగా సంస్థలో చేరిన వారు అంకితభావంతో పని చేయాలన్నారు. సంస్థ నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునేలా కృషి చేయాలని సూచించారు. కష్టపడిన వారికి భవిష్యత్ ఆనందంగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల సింగరేణి అధికారులు, వివిధ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

(5వ పేజీ తరువాయి)

చేశారని అన్నారు. నేడు ఇందిరమ్మ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణ పనులను చేపట్టడంతో దానిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రతి పేదవాడికి నీడను అందించడంతోపాటు కడుపు నిండా తిండి తినడానికి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని అన్నారు. జిల్లాను పూర్తిస్థాయిలో పర్యాటక ప్రాంతంగా మార్చడానికి నిధులు కేటాయించడం జరిగిందని, రూ.70కోట్లతో రామప్పలో పనులు చేపట్టడమే కాకుండా రూ.30కోట్లతో ఐలాండ్ అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందని అన్నారు. మహిళలకు బొంగు చికెన్‌పై శిక్షణ శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్. మహేందర్‌జీ, సంపత్‌రావు, ఆర్డీవో వెంకటేష్, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంతకుముందు హెలికాప్టర్ ద్వారా ములుగు చేరుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయసీతక్క, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్‌లకు కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ శబరీశ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్‌లు పూలమొక్కలు అందజేసి స్వాగతం పలికారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

భూపాలపల్లిటౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంఈవో దేవానాయక్ అన్నారు. బుధవారం భూపాలపల్లి పట్టణంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఒక్క రోజు శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీప్రసన్న అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఎంఈవో దేవానాయక్ హాజరై మాట్లాడారు. ప్రతి పాఠశాలను మన సొంత ఇల్లుగా భావించి పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్పీ రామయ్య, మండలంలోని 57 మంది పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

- చిట్యాల: పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని మండల విద్యాశాఖ అధికారి కోడెపాక రఘుపతి అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శానిటేషన్, మధ్యాహ్నభోజన కార్మికులకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో రఘుపతి మాట్లాడుతూ తరగతి గదులు, మరుగుదొడ్లు, వాష్‌రూంలు శుభ్రంగా ఉండేవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలన్నారు. ఆర్పీలు కుసునపు కిరణ్‌కుమార్, సరళాదేవి శానిటేషన్ సిబ్బంది, వంట కార్మికుల పనితీరు, బాధ్యతలను వీడియోల ద్వారా వివరించారు.

రోస్టర్ రికార్డుల పరిశీలన

కృష్ణకాలనీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి ఏరియాలో పనిచేస్తున్న ఎస్సీ ఉద్యోగులకు సంబంధించిన రోస్టర్ రికార్డులను చీఫ్ లైజన్ ఆఫీసర్ దుర్గం రామచందర్ బుధవారం పరిశీలించారు. సింగరేణిలోని అన్ని ఏరియాల వ్యాప్తంగా చేస్తున్న రోస్టర్ రికార్డులను పరిశీలనలో భాగంగా భూపాలపల్లి ఏరియాలో పరిశీలన చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా ఏరియాలో అమలుచేస్తున్న రూల్ ఆఫ్ రిజర్వేషన్ పద్ధతిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా సివిల్ విభాగం ద్వారా నిర్వహిస్తున్న వివిధ కాంట్రాక్టులలో ఎస్సీ రిజర్వేషన్ అమలును పరిశీలించారు. కార్యక్రమంలో సింగరేణి జీఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి, ఏరియా అధికార ప్రతినిధి కావూరి మారుతి, వివిధ విభాగాల సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా సత్యనారాయణ

మొగుళ్లపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మొగుళ్లపల్లి మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా సత్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేసిన సుభాష్‌చంద్రబోస్ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నారు. కాగా, ఇదే మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న సత్యనారాయణకు అదనంగా ఇన్‌చార్జి ఎంపీడీవో బాధ్యతలు అప్పగించారు.

పోల్ ట్యాక్స్‌ను రద్దు చేయాలి

- కేబుల్ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్

భూపాలపల్లిటౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కేబుల్ ఆపరేటర్ల దైన్య పరిస్థితిని గుర్తించి ప్రభుత్వం పోల్ ట్యాక్స్‌ను రద్దు చేయాలని కేబుల్ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ డిమాండ్ చేశాడు. బుధవారం పట్టణంలోని కాకతీయ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత తరుణంలో కేబుల్ టీవీ ఆపరేటర్ల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. 30 ఏళ్లుగా స్వంత పెట్టుబడితో స్వయం ఉపాధి పొందుతూ ప్రభుత్వ పరంగా ఎలాంటి పథకాలు దక్కకుండా పోతున్నాయని తెలిపారు. తమను చిన్న తరహా పరిశ్రమల యజమానులుగా గుర్తించి సబ్సిడీ రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో రమేష్, సురేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కాటారం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బొడ్డు స్మరణ్ కోరారు. ఈ మేరకు బుధవారం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు వినతి పత్రమందించారు. కాటారం మండలకేంద్రంలో ఎస్ఎంఎస్ హాస్టల్ ఏర్పాటు చేయించాలని కోరారు. దొబ్బలపాడు మోడల్ స్కూల్ బాలికల వసతిగృహ భవన నిర్మాణం పూర్తి చేయాలన్నారు. దామెరకుంట ఎస్సీ బాలికల గురుకుల కళాశాలను ఎత్తివేయకుండా చూడాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ఎంపీని కోరగా సానుకూలంగా స్పందించినట్లు స్మరణ్ వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కాటారం డివిజన్ నేతలు శ్రావణ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎంపీ పరామర్శ


బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న ఎంపీ వంశీకృష్ణ

మహదేవపూర్ రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ బ్యారేజీ వద్ద గోదావరి నదిలో గల్లంతై మృత్యువాత పడిన మృతుల కుటుంబాలను పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ బుధవారం పరామర్శించారు. మహదేవపూర్ మండలం అంబట్‌పల్లికి చెందిన పట్టి శివమనోజ్, మధుసూదన్, కర్నాల సాగర్, తొగరి రక్షిత్ కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని. తనవంతుగా మృతుల కుటుంబాలకు అండగా ఉంటానన్నారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన

మంగపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మంగపేట రైతు వేదిక భవనంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు అవగాహన సదస్సు స్థానిక ఎంపీడీవో బి.భద్రు అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో కమలాపురం, మంగపేట, బోరునర్సాపురం, కోమటిపల్లి, కొత్తూరుమొట్లగూడెం గ్రామపంచాయతీల లబ్ధిదారులు, సిమెంట్, ఐరన్ సప్లయర్స్ కాంట్రాక్టర్లు బ్రిక్స్ తయారీ సప్లయర్స్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐకేపీ ఏపీఎం అప్పారావు మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5లక్షలు మంజూరు చేస్తుందని తెలిపారు. 400 నుంచి 430 ఎస్ఎఫ్‌టీలో ఇంటి నిర్మాణం ఎలా చేయాలో పూర్తి వివరించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు పాల్గొనగా వారికి మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో భద్రు మాట్లాడుతూ ఈనెల 12 నుంచి 45 రోజుల్లో ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలని పేర్కొన్నారు.

తొలిమెట్టు అంగన్‌వాడీ నుంచే ఆరంభం

కృష్ణకాలనీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రెండున్నరేళ్లు దాటిన చిన్నారులందరికి విద్య అందించే తొలిమెట్టు అంగన్‌వాడీ కేంద్రాల నుంచే ఆరంభమవుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ అన్నారు. బుధవారం భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని భాస్కర్‌గడ్డ అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని ప్రారంభించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ విద్య ఆట-పాటల విద్య అని, దీని వలన పిల్లలు శారీరకంగా, మానసికంగా ఒత్తిడి లేకుండా ఎదుగుతారన్నారు. అనంతరం అంగన్‌వాడీలో ఉండే ప్రీస్కూల్ మెటీరియల్, ఆట వస్తువులు, ఎల్‌కేజీ, యూకేజీ బుక్స్, కథల బుక్స్ తల్లులకు చూపించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షురాలు తోట విశాల, వీవో ముస్కె పద్మ, ఆశావర్కర్ తిరుమల, అంగన్‌వాడీ టీచర్లు ఎస్.సువర్ణ, ఎం.అరుణ, ఇ.సుగుణ, పి.అపర్ణ, జి.అమృత, ఆయాలు పాల్గొన్నారు.

పోతురాజు విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం

మంగపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోమటిపల్లి-మంగపేట మధ్య అడవిలో వెలిసిన శ్రీ ముక్కుడు పోశమ్మ, నాగులమ్మ దేవాలయాల ఆవరణలో పోతురాజు విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకలు బుధవారం ప్రారంభమయ్యాయి. గణపతిపూజ, పుణ్యాహవచనం అఖండ దీపాస్థాపన, కలశస్థాపన కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. 12న ఉదయం ముక్కుడు పోశమ్మ దేవత గుడి వద్ద పోతురాజుస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన, బలిహరణ, పూర్ణాహుతి నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లను నిర్వాహకులు చేస్తున్నారు. మొదటి రోజు పోతురాజు గద్దె నిర్మాణ విగ్రహ ప్రతిష్ఠ దాతలు దిడ్డి గణపతి-శ్వేత దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

జీపీ ట్రాక్టర్లను నడపలేం : కార్యదర్శులు

గణపురం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం కోసం ఉపయోగించే ట్రాక్టర్ల నిర్వహణ భారంగా ఉందని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు రాకపోగా తమ వేతనాల నుంచి పారిశుధ్య పనులు చేపట్టాల్సి వస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు బుధవారం జీపీ ట్రాక్టర్ల తాళాలను ఎంపీడీవో భాస్కర్‌కు కార్యాలయంలో అందజేసి పలు డిమాండ్ల వినతి పత్రాన్ని ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శులు విజేందర్, నాగమణి, రాకేష్, నరేష్, షఫి, నవీన్ పాల్గొన్నారు.

- కాటారం: గ్రామ పంచాయతీల్లో నిధుల కొరత ఉన్నందున ట్రాక్టర్లలో డీజిల్ పోసి నడిపించలేమంటూ కార్యదర్శులు బుధవారం ఎంపీడీవో బాబుకు ట్రాక్టర్ల తాళంచెవులను అందించారు. పంచాయతీ కార్యదర్శుల ఉద్యమ కార్యాచరణలో భాగంగా జీపీ కార్యదర్శులు రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు జీపీల్లో ట్రాక్టర్లను నడిపించలేమని తాళం చెవులను అధికారులకు అప్పగించి నిరసన తెలిపారు. 21మంది కార్యదర్శుల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు.

భూ భారతి సదస్సు పరిశీలన

మల్హర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వల్లెంకుంట గ్రామంలో జరుగుతున్న భూభారతి రెవెన్యూ సదస్సును జిల్లా అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడి భూ సంబంధిత సమస్యలను తెలుసుకున్నారు. భూ నమోదులు, రికార్డులు సర్దుబాటు, వాస్తవికంగా భూములపై ఉన్న హక్కుల విషయాల్లో ప్రజలకు అవగాహన కల్పించి రెవెన్యూ అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన

వాజేడు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు బుధవారం అధికారులు అవగాహన కల్పించారు. పేరూరు, చెరుకూరు రైతు వేదికల వద్ద ఏర్పాటు చేసిన సదస్సులో ఇంటి నిర్మాణంకు సంబంధించిన విశేషాలను, బిల్లుల మంజూరు, ఇంటి కొలతలు తదితర అంశాలపై ఎంపీడీవో శ్రీకాంత్ నాయుడు వివరించారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ ఏపీఎం లక్ష్మీ దుర్గా, ఏఈవో హరీష్, జీపీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన వంట కార్మికులకు శిక్షణ

భూపాలపల్లిటౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విద్యాలయాల్లో మధ్యాహ్న భోజనం నిర్వహించే వంట కార్మికులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం జిల్లా బాలిక, శిశు అభివృద్ధి అధికారి శైలజ ఆధ్వర్యంలో జరిగింది. జిల్లాలోని కస్తూర్బా, ఆదర్శ, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు మారిన మెనూ ఆధారంగా వంటలు నిర్వహించాలన్నారు. పొంగలి, జీరా రైస్, బోండా, పకోడి, ఎగ్ బజ్జీ, దోసకాయ పప్పు, ఎగ్ ఫ్రైడ్ రైస్, టమాట వంటి కూరగాయల వండించి వారికి రుచి చూపించడం జరిగింది. రుచికరమైన పోషకాలతో కూడిన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని కోరారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

రేగొండ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి భాగిర్తిపేట వరకు మంజూరైన రోడ్డు విస్తరణ పనులను బుధవారం చేపట్టారు. రోడ్డు వెడల్పు 30 ఫీట్లు కాగా విస్తరణలో భాగంగా రెండు వైపులా ఉన్న ఇళ్లు, ప్రహరి గోడలు కొంత వరకు తొలగించనున్నారు. దీంతో గ్రామ పంచాయితీ నుంచి గృహ యజమానులకు నోటీసులు ఇచ్చారు. ఈ క్రమంలో మొదటగా ప్రహరి గోడలు తొలగించారు. కొంత బాగం ఇళ్లు కోల్పోయే వారికి స్వయంగా తొలగించుకోవడం లేదా అందులో ఉన్న సామగ్రిని తరలించుకోవాలని సూచించారు. కాగా, రోడ్డు విస్తరణకు సహకరిస్తామని, ముందుగా డ్రైనేజీ నిర్మించిన తర్వాతనే రోడ్డు వేయాలని గ్రామస్థులు కోరారు.

నేడు మంత్రి సీతక్క పర్యటన

ఏటూరునాగారం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఏటూరునాగారం మండలంలో గురువారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క పర్యటించనున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొని, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం కానున్నారు. ఉదయం 10.30 గంటలకు స్థానిక గిరిజన భవన్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంత్రి సీతక్క చేతుల మీదుగా మంజూరు పత్రాలను పంపిణీ చేయనున్నారు. అనంతరం 11 గంటలకు నూతన బస్సు డిపో పనులకు శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు మండలాల వారీగా ముఖ్య నాయకులతో మంత్రి సమావేశం నిర్వహించనున్నారు.

ఏఎన్ఎంలను రెన్యూవల్ చేయాలి

ఏటూరునాగారం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి):ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలను రెన్యూవల్ చేయాలని బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గండేపల్లి సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం ఏఎన్ఎంలతో సమావేశమయ్యారు. అనంతరం పీవో చిత్రామిశ్రాను కలిసి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. ములుగు, భూపాలపల్లి జిల్లాల ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న 54 మంది ఏఎన్ఎంలను వెంటనే రెన్యూవల్ చేయాలని కోరారు. వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధుల నుంచి విద్యార్థులను కాపాడటానికి ఏఎన్ఎంల సేవలు అత్యవసరమని అన్నారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు వినుకోల్లు చక్రవర్తి, జగన్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రైతు సంఘం జిల్లా మహాసభను విజయవంతం చేయండి

గోవిందరావుపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : గోవిందరావుపేటలో గురువారం జరిగే తెలంగాణ రైతు సంఘం ములుగు జిల్లా రెండవ మహాసభను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండలకేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతులు తమ హక్కుల సాధన కోసం మహాసభకు కదలిరావాలన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చి రైతుల హక్కులను కాలరాస్తుందని మండిపడ్డారు. ఆ చట్టాన్ని వెనక్కి తీసుకుంటామని చెప్పిన ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం నూతన వ్యవసాయ మార్కెట్ విధానం పేరుతో దొడ్డిదారిన మరో చట్టం తీసుకువచ్చి కుట్ర చేస్తుందని ఆరోపించారు. అదేవిధంగా జిల్లాలోని రైతులకు గోదావరి జలాలను అందించాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గుండు రామస్వామి, తీగల ఆదిరెడ్డి, సదానందం, సాంబయ్య, భీమేష్, నాగేష్, కృష్ణ, సూర్యనారాయణ, శ్రీను, సారయ్య, ఆదిరెడ్డి, ధర్మారెడ్డి, లెనిన్, కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

టైరు పేలి చెట్టును ఢీకొన్న కారు

- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి తప్పిన ప్రమాదం

కృష్ణకాలనీ/తాడ్వాయి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): టైరు పేలి చెట్టుకు కారు ఢీకొన్న ఘటనలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీపీఐ జిల్లా సెక్రటరీ కొరిమి రాజ్‌కుమార్‌కు బుధవారం ప్రమాదం తప్పింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో జరిగిన యూనియన్ మీటింగ్‌కు హాజరై తిరుగు ప్రయాణమైన ఆయన కారు మార్గమధ్యలో ములుగు జిల్లా తాడ్వాయి సమీపంలో కారు టైరు పేలి చెట్టుకు ఢీకొంది. దీంతో ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి. అలాగే, డ్రైవర్ కూడా స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఆ వెంటనే అక్కడి నుంచి జిల్లా కేంద్రంలోని సింగరేణి ఏరియా ఆసుపత్రికి వచ్చి చికిత్స పొందారు. ప్రస్తుతం ఇద్దరి పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు తెలిసింది. కాగా, ఈ ప్రమాద విషయం తెలియగానే పలువుర ఏఐటీయూసీ, సీపీఐ నేతలు ఆసుపత్రికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి : ఏఐఎస్ఎఫ్

ములుగు టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు పాఠశాలల్లో జరుగుతున్న అధిక ఫీజుల వసూళ్లను ఆపాలని, విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని ఆలిండియా స్టూడెంట్స్ ఫెడరేషన్(ఏఐఎస్ఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి(డీఈవో)కి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుమ్మరి సాగర్ మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, ఇతర విద్యారంగ మౌలిక వస్తువులను పాఠశాలల్లోనే అమ్ముతూ విద్యా వ్యాపారానికి పాల్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలు, ఫీజుల చట్టాలను తుంగలో తొక్కి విచ్చలవిడిగా ఫీజుల వసూలు చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రైవేట్ విద్యాసంస్థలపై సర్వేలు నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు అనుముల రాజకుమార్, నారా దిలీప్, వేణు, నవీన్, రమేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ఆర్‌సీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మహేందర్

మల్హర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ మానవ హక్కుల కమిటీ(ఎన్‌హెచ్ఆర్‌సీ) జిల్లా ప్రధాన కార్యదర్శిగా మహేందర్ ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య ఆదేశాల మేరకు బుధవారం ప్రకటించినట్లు జిల్లా అధ్యక్షుడు దుంద్ర కుమార్‌యాదవ్ తెలిపారు. తన నియామకానికి సహకరించిన వారందరికి మహేందర్ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో త్వరలోనే నూతన కమిటీలు వేసి సమస్యల పరిష్కారం దిశగా పాటుపడుతానని ఆయన స్పష్టం చేశారు.

ఫర్టిలైజర్స్, సీడ్స్ షాపుల తనిఖీ

కన్నాయిగూడెం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ఫర్టిలైజర్ షాపుల యజమానులు రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి ముంజ మహేష్ హెచ్చరించారు. మండలంలోని లక్ష్మీపురం, ముప్పనపల్లి గ్రామాల్లోని ఫర్టిలైజర్స్, సీడ్స్ షాపులను మహేష్ ఆధ్వర్యంలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా షాపుల్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న మిరప, వరి తదితర విత్తనాల ప్యాకెట్లతో పాటుగా వాటికి సంబంధించిన సోర్స్ సర్టిఫికెట్, డెలివరి చలాన్, కంపెనీల జీవోటీ పాస్ సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

దత్తసేవా ట్రస్టు సాయం

మంగపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలాద్రిపేటకు చెందిప పశువుల కాపారి గాండెర్ల నాగేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం విదితమే. ఆ నిరుపేద కుటుంబాన్ని బుధవారం శ్రీ లక్ష్మీనర్సింహ దత్తసేవా ట్రస్టు ఆధ్వర్యంలో పరామర్శించి ఓదార్చారు. ఈక్రమంలో 50 కిలోల బియ్యం రూ.10వేల విలువ గల నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు మండల అధ్యక్షుడు నూతలకంటి ఈశ్వర్‌చంద్ శర్మ, సభ్యులు గౌరీశంకర్, నర్సింహరావు, సాంబయ్య, నర్సింహరావు, రవి, మహేష్ పాల్గొన్నారు.